క్లుప్తంగా

శ్రీనివాసరెడ్డికి అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా అవార్డు



అవార్డు అందుకుంటున్న మానుకొండ శ్రీనివాసరెడ్డి

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల సిద్ధార్థ హైస్కూల్ డైరెక్టర్ మానుకొండ శ్రీనివాసరెడ్డికి అబ్దుల్‌కలాం నేషనల్ ప్రతిభా అవార్డును ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు అందజేశారు. ఇంటర్నేషనల్ టీచర్స్ డే సందర్భంగా అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని ఆదివారం నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో పేద విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను అందించినందుకు ఈ అవార్డు ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల సిబ్బంది, పుర ప్రముఖులు శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపారు.

నడిరోడ్డుపై ఆవుల సంచారం



రోడ్డుపైనే పడుకున్న గోవులు

కురిచేడు: మండల కేంద్రమైన కురిచేడులో ఆవులు రోడ్లపైనే తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. బస్సులు హారన్ మోగించినా కూడా తొలగకుండా రోడ్లపై అడ్డంగా పడుకుంటున్నాయి. ఆవులను ఇళ్ల వద్దే కట్టేయాలని, గ్రామంలోకి వదిలిపెట్టకూడదని పంచాయతీ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయించినప్పటికీ వాటి యజమానుల్లో మార్పు రాలేదు. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆవులను వదిలేస్తున్న వారిపై చర్యలు తీసుకోకుంటే తప్ప పరిస్థితిలో మార్పు రాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ




రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు(దర్శి): స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆదివారం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. బాధితులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. గంజాయి, పేకాట, నిషేధిత గుట్కా వ్యాపారంపై నిఘా ఉంచాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టిసారించాలన్నారు. రాత్రి పూట గస్తీని ముమ్మరం చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

దొనకొండ: వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఈ షేక్ నాగూర్‌వలి సూచించారు. విద్యుత్ పరంగా ఏ చిన్న సమస్య వచ్చినా తమ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, సపోర్ట్ తీగలకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో పశువులను స్తంభాలకు కట్టేయవద్దని, మహిళలు వర్షానికి తడిసిన దుస్తులను ఇనుప తీగలపై ఆరవేయవద్దని, రైతులు పొలాలకు వెళ్లిన ప్పుడు విద్యుత్ తీగ తెగి పడి ఉంటే తాకకుండా తమ సిబ్బందికి తెలియజేయాలన్నారు. రైతులు విద్యుత్ మోటార్ ఆన్ చేసే సమయంలో బటన్ చేతితో కాకుండా కర్రతో నొక్కాలని, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతుంటే వాటికి కూడా దూరంగా ఉండాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ



కొనకనమిట్ల: ఇటీవల ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా బాలుర జట్టు ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచిందని కోచ్, పీడీ వై.బాలగురవయ్య పేర్కొన్నారు. జిల్లా జట్టులో ప్రతిభ చాటిన గొట్లగట్టు జెడ్పీ స్కూల్ విద్యార్థులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి, పి.యువరాజుకు ప్రశంసా పత్రాలు అందజేశారు. హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికల జట్టులో రాజారపు లక్ష్మీకల్పన జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైందని తెలిపారు. పీడీతోపాటు క్రీడాకారులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

ఖరీఫ్‌ను ముంచిన వాన



త్రిపురాంతకం మండలంలో దెబ్బతిన్న పంటలు



దెబ్బతిన్న మిరప

- వర్షాలతో దెబ్బతిన్న వాణిజ్య పంటలు
- నష్టపోయిన రైతాంగం
- ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కోసం ఎదురుచూపు

త్రిపురాంతకం: వాయుగుండం ప్రభావంతో మండలంలో పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి ఉరకెత్తడంతో ఖరీఫ్‌లో వేసిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. త్రిపురాంతకం మండలంలో సాగుచేసిన వాణిజ్య పంటలు మిర్చి, పత్తి, పొగాకు, కంది దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈఏడాది వర్షాలు అధికంగా కురవడం, లేకుంటే పూర్తిగా ఎండలు భగభగ మండిపోవడంతో పంటలకు తగిన వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకుండా పోయాయి. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు పడిన తర్వాత పూర్తిగా వాతావరణం వేడెక్కింది. మండే ఎండలు పైర్లను ఎండబెట్టాయి. వేసిన పైరు సక్రమంగా లేక రైతులు ఇప్పటికే రెండోసారి పైర్లు వేయాల్సి వచ్చింది. తదుపరి కురిసిన వర్షాలకు రైతులు ప్రధానంగా మిర్చి, పొగాకు, పత్తి, కంది వంటి పంటలను అధికంగా సాగు చేశారు. మెట్ట ప్రాంతంలో వేసిన పైర్లు ఏపుగా పెరిగి అనుకూలంగా ఉన్న సమయంలో మళ్లీ వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు దెబ్బతీశాయి. ముఖ్యంగా మిరప, పత్తి, కంది మొక్కలు వేరుకుళ్లి పోతుండటంతో మొక్క ఎండు ముఖం పట్టింది. ఇక ఈఏడాది పంటలు పండించే పరిస్థితిలేదని వేసిన పంటలు ఈవిధంగా దెబ్బతింటే ఇక వ్యవసాయం ఏవిధంగా చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక సారి పైరు వేయాలంటే భూమి దున్ని చదునుచేసి, నారు పోసి లేక కొనుగోలు చేసి మొక్క నాటి కలుపు తీసేసరికి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు రైతులు ఖర్చు చేశారు. ఇక ఎరువులు, పురుగు మందులు వంటివి తప్పనిసరి. మరో రెండు మూడు నెలలు ఉంటే ఎంతో కొంత ఫలసాయం వచ్చేదని, ప్రస్తుత వర్షాల కారణంగా కనీసం ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదే విధంగా వర్షాలు కురిస్తే ఇక వేసిన పైర్లు మిగలవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పంటలకు సుడిదోమ, పొడ, వేరుకుళ్లు వంటి తెగుళ్ల ఆశించి రైతులు వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వాతావరణం అనుకూలించి తిరిగి పంటలు ఎంతవరకు నిలుస్తాయో ఈనెలాఖరుకు తేలిపోతుంది. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని.. ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.



నిలువున మాడిపోతున్న పొగతోట



వేరుకుళ్లి ఎండుతున్న కంది

నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

పుల్లలచెరువు: టీడీపీ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్ శనివారం యర్రగొండపాలెం శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ పై చేసిన ఆరోపణలు నిరాధారమైనవి అని, నోటికొచ్చినట్లు అవాకులు, చెవాకులు పేలితే సహించబోమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం పుల్లలచెరువులో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరు అవినీతిపరుడో ప్రజలకు అర్థమవుతోందని అన్నారు. గతంలో కంటే భిన్నంగా నియోజకవర్గంలో పరిపాలన సాగుతోందని, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం లేకుండా పలు కార్యక్రమాలు చేస్తున్నారంటే వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. రేషన్ దందా, మద్యం మాఫియాను ప్రోత్సహిస్తోంది మీ నాయకుడు ఎరిక్షన్ బాబే కదా, ఆయనతో పాటు నీకు భాగం లేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు గాలికి వదిలేసి తమ సొంత సంపాదనే ధ్యేయంగా మండల ప్రజలను దోచుకోవడం లేదా అని నిలదీశారు. కార్యక్రమంలో చాపలమడుగు, నాయడుపాలెం సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఎ.కోటిరెడ్డి, నియోజకవర్గ నాయకుడు ఉమామహేశ్వరరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి రోసిరెడ్డి, నాయకులు జి.ఆంజనేయులు, కె.కాశయ్య, బక్కిరెడ్డి, బాజీ, మల్లెల వెంకటరెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మర్కట సంకటం..!



వీధులలో ప్రజలను భయపెడుతున్న కోతులు

కురిచేడు: మండల కేంద్రమైన కురిచేడు వాసులను మర్కటాలు భయకంపితులను చేస్తున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ కనిపించినవారినల్లా కలవరపాటుకు గురిచేస్తున్నాయి. కూరగాయలు, పండ్లు తీసుకెళ్తున్న మహిళల నుంచి కవర్లు లాక్కొని పారిపోతున్నాయి. కోతుల గుంపు రెండు వర్గాలుగా విడిపోయి బీభత్సం సృష్టిస్తుండటంతో పాటు ఆ ఉద్రేకంలో కనిపించిన వారిపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. ఎవరైనా ఆదమరచి ఇంటి తలుపులు తీసి ఉన్నట్లయితే నేరుగా వెళ్లి గందరగోళం సృష్టిస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని కురిచేడు వాసులు మొరపెట్టుకుంటున్నారు.



చెత్తబండిని చిన్నా బిన్నం చేస్తున్న కోతులు

త్రిమూర్తి స్వరూపిణిగా అల్లూరి పోలేరమ్మ



త్రిమూర్తి స్వరూపిణిగా భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపిణిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలను భక్తులు పూజించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈఓ, చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పగిడి అల్లూరిరెడ్డి(71) శనివారం రాత్రి మృతి చెందారు. పగిడి అల్లూరిరెడ్డి జేపీ చెరువు గ్రామ సమీపంలోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో 2016లో కాశీనాయన రెడ్ల అన్నదాన సత్రం స్థాపించి, తన సొంత ఖర్చుతో భవనం నిర్మించడమే కాకుండా ప్రతి శనివారం భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్నారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారని, శనివారం జేపీ చెరువు గ్రామంలోని తన నివాసంలో మృతి చెందగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కనువిందు చేసిన హరివిల్లు

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. గత వారంరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కూడా కొద్దిసేపు ఎండ కాయగా.. కాసేపు వర్షం పడింది. సాయంత్రం వేళ పట్టణ శివారులోని దరిమడుగు వద్ద ఈ దృశ్యం కనిపించింది.





పులివాగులో చేపలు పడుతున్న గుంతపల్లె వాసులు

వల నిండా పడాలి చేపలు!

కొమరోలు: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొమరోలు మండలంలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని గుంతపల్లె గ్రామం సమీపంలో కల్వర్టు కింద పులివాగు ప్రవహిస్తుండటంతో స్థానికులు వలలతో చేపలవేట సాగిస్తున్నారు.

కలాం అవార్డు గ్రహీతలకు అభినందనలు



అవార్డు అందుకుంటున్న గఫార్ అలిఖాన్

తర్లుపాడు: బాపట్ల జిల్లాలోని కేవీఆర్ అండ్ ఎంకెఆర్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు వెన్నా నారాయణ రెడ్డి ఆదివారం సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఏసీ కాలేజీలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అత్తమామలు బండి కేశవరెడ్డి, నారాయణమ్మ, బావమరుదులు బండి శ్రీనివాసరెడ్డి, రామాంజనేయరెడ్డి, స్వగ్రామం చెన్నారెడ్డిపల్లి వాసులు, మార్కాపురంలోని బంధుమిత్రులు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. మార్కాపురంలోని ఎస్‌కేపీ కళాశాల డిగ్రీ స్నేహితులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

కంభం: స్థానిక ఎంజీ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ గఫార్ అలిఖాన్ అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా ఆయనకు అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు గఫార్ అలిఖాన్‌ను అభినందించారు.

ప్రవర్తనలో మార్పు ఉంటే రౌడీ షీట్ రద్దు చేస్తాం

- సీఐ ప్రభాకరరావు



పెద్దదోర్నాలలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

పెద్దదోర్నాల: నేరస్తుల ప్రవర్తనలో మార్పు ఉంటే రౌడీ షీట్ రద్దు చేస్తామని అది గ్రహించి సత్ప్రవర్తనతో మెలగాలని యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు ఎటువంటి గొడవల్లో పాల్గొనవద్దని హెచ్చరించారు. రౌడీ షీటర్లు నిరంతరంగా కేసుల్లో చిక్కుకుంటే వారి బెయిల్ రద్దుచేసి తిరిగి జైలుకు పంపుతామన్నారు. గొడవల్లో కానీ దందాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచి జీవితాన్ని గడపాలని కోరుకునే వారు ఎక్కడైనా గొడవలు జరుగుతుంటే అక్కడి నుంచి తప్పుకోవాలని సూచించారు. ఏదైనా సమాచారముంటే వెంటనే పోలీసులకు తెలిపి వారికి సహకరించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు. ఈ కౌన్సెలింగ్‌లో ఎస్సై మహేష్, రైటర్ మోహన్ తదితరులు ఉన్నారు.

దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటమ రాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజు స్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల ప్రాంగణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



ప్రత్యేక అలంకరణలో వేనూతలకాటమరాజు

గురిజేపల్లిలో కార్డెన్ సెర్చ్

యర్రగొండపాలెం: జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ కదలికలను దృష్టిలో పెట్టుకొని ఆదివారం మండలంలోని గురిజేపల్లిలో పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో ప్రతి ఇంటినీ తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ప్రభాకరరావు, ఎస్సై చౌడయ్య మాట్లాడుతూ చెడ్డీ గ్యాంగ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ గ్యాంగ్‌పై ఎస్పీ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా పెట్టారని, అనుమానితులు, కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సైలు

అధ్వానంగా తెల్లబాడు-వెస్ట్ కంభంపాడు రోడ్డు



తెల్లబాడు-వెస్ట్ కంభంపాడు రోడ్డు దుస్థితి ఇదీ..

దొనకొండ: మండలంలోని తెల్లబాడు నుంచి వెస్ట్ కంభంపాడు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం పడితే బురదమయంగా మారుతోంది. సుమారు 2 కి.మీ మేర రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రెండు గ్రామాల రైతులు నిత్యం వ్యవసాయ పనులకు ట్రాక్టర్లలో వెళ్లేందుకు ఈ రహదారినే వినియోగిస్తుంటారు. ఇప్పటికే ఎన్నోసార్లు వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. వెస్ట్ కంభంపాడు నుంచి తెల్లబాడు పాఠశాలకు విద్యార్థులు నడిచి వెళ్లాల్సి ఉంది. వర్షం కురిసిన సమయంలో పిల్లలు ఈ రహదారిలో నడవలేక యాతనపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మానవతా సంస్థకు ఫ్రీజర్ బహూకరణ

దర్శి: మానవతా సంస్థకు ఫ్రీజర్ బాక్సు కోసం అడ్వాన్స్‌గా పసుపులేటి వెంకట నారాయణ రూ.50 వేలను సంస్థ ప్రతినిధులు కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, ట్రెజరర్ జి.వేణు, పొదిలి మానవతా సంస్థ ఎడ్యుకేషన్ కమిటీ డైరెక్టర్ బాదం వెంకటేశ్వరరెడ్డికి ఆదివారం అందజేశారు. నారాయణ కుటుంబ సభ్యులు ఐదుగురు సంస్థలో సభ్యత్వం తీసుకున్నారని అధ్యక్షుడు తెలిపారు.



సంస్థ ప్రతినిధులకు నగదు అందజేస్తున్న వెంకట నారాయణ